# మద్యం సిండికేట్ రాజ్యం..!

సింగరేణిలో ఎమ్మార్పీపై

రూ.20 నుంచి రూ.50 అదనపు వసూళ్లు..?

చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ..

సిండికేట్‌కు కొమ్ముకాస్తున్న అధికారులా..?

3లో



Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 200
సంచిక : 300
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం, జులై 17, 2026


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## యుద్ధ ప్రాతిపదికన

# సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి



**-సీతారామ ప్రాజెక్టు ,సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పై మంత్రుల సమీక్ష**

**టీ మీడియా, జూలై 16, సత్తుపల్లి:**సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు.అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన



భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూలి సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.సీ. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు.నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ,

3లో



## రైల్వే డబ్లింగ్ భూ నిర్వాసితుల సమస్యపై క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన

### రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం

### స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

**టీ మీడియా,జులై16,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలో డోర్నకల్--భద్రాచలం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు నిర్వాసితుల భూములకు సంబంధించి నెలకొన్న సమస్యపై గురువారం అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు.ఈ పరిశీలనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,తహసీల్దార్ (ఎంఆర్వో),ఆర్ఐ,జీపీఓ,అటవీ శాఖకు చెందిన ఎఫ్ఆర్ఓ,డీఆర్ఓ,ఎఫ్‌బీఓ,రైల్వే శాఖ డీఈ,జేఈ,గాదెపాడు సర్పంచ్ రంజిత్

3లో

# ఎల్లలులేని సేవకు అరుదైన పురస్కారం

## పులిపాటికి "ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు



**స్వయంగా బహుకరించిన**

**ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**

**టీ.మీడియా,జూలై16, ఖమ్మం :**ఎల్లలు లేని సేవకు అరుదైన పురస్కారం లభించింది. స్వార్థమెరుగని నిజాయితీకి మరో బహుమానం దక్కింది. తన, మన బేధం లేకుండా ఆపద సమయంలో అందరినీ అక్కున చేర్చుకునే నిస్వార్థమూర్తి డాక్టర్ పులిపాటి ప్రసాద్ కు "ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు" లభించింది. ఈ పురస్కారాన్ని 16వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో (ఉండవల్లి) ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పులిపాటికి స్వయంగా బహుకరించడం విశేషం. కరోనా కష్ట కాలంలో విష పరిస్థితులను సైతం అధిగమించి మానవాళికి ఆయన చేసిన సేవలకు



గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. సాటి మనిషిని సమీపించలేని దుస్థితిలోనూ పులిపాటి

3లో



## మెచ్చా నాగేశ్వరరావు హౌస్ అరెస్ట్

**టీ మీడియా, జూలై 16,దమ్మపేట :** బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు రైతుల సమస్యలపై నిరసనకు సిద్ధమైన అశ్వారావుపేట నియోజకవర్గ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించగా, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును దమ్మపేట తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అన్నారు. ఉప ముఖ్యమంత్రితో సహా మంత్రుల దండు మణుగూరు వస్తుంటే, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తారనే వణుకు ఎందుకు పట్టుకుందని, అధికారంలోకి రాకముందు ఆకాశం నుంచి అమృతం తెస్తామన్న కాంగ్రెస్ నాయకులు, తీరా గద్దెనెక్కాక రైతుల కష్టాలు అడిగితే పోలీసులతో అరెస్టులు చేయిస్తారా? అంటూ విరుచుకుపడ్డారు. ఓట్లు వేసిన పాపానికి ప్రజలకు మీరు ఇస్తున్న బహుమతి జైలు శిక్షలా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అన్నారు.



## తాటి చెట్ల నరికివేతపై చర్యలు తీసుకోవాలి

**-గీత పనివారల సంఘం డిమాండ్**

**టిమీడియా, జూలై 16, కురవి:** కురవి మండలంలో తాళ్ల సంకీస గ్రామంలో గీత వృత్తిపై ఆధారపడిన సుమారు 15 తాటి చెట్లను రాత్రికి రాత్రే నరికివేయడంపై తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం మహబూబాబాద్ జిల్లా సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు బాధ్యులైన కొండపల్లి శ్రీదేవి మరియు సహకరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు దొంతు రామ్మూర్తి గౌడ్, జిల్లా కోశాధికారి నక్క నాగార్జున గౌడ్ డిమాండ్ చేశారు.గతంలో కూడా 150కు పైగా తాటి చెట్లను నరికివేయడం జరిగిందని, దీంతో సిరోలు, కురవి మండలాల పరిధిలోని గీత వృత్తిదారుల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గీత వృత్తిదారులు, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

**సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన**

**టి మీడియా, జులై16, ఖమ్మం రూరల్:** ఖమ్మం రూరల్ మండలం ఆరంపుల పంచాయతీ పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఆరంపుల గ్రామానికి చెందిన మేడా రవీందర్ అనే ప్రైవేట్ ఎలక్ట్రిషన్ విద్యుత్ స్తంభంపై మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఎలక్ట్రిషన్ అయిన రవీందర్‌ను విద్యుత్ శాఖ అధికారులు పనుల కోసం తీసుకువచ్చారని, సరైన భద్రతా చర్యలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాదం జరిగిన అనంతరం బాధితుడిని పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారని కూడా స్థానికులు ఆరోపించారు.ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గ్రానైట్ ఫ్యాక్టరీ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.



# చలో రంపచోడవరం జయప్రదం చేయండి

**సీసం సురేష్**

**టీ.మీడియా,జూలై16,చింతూరు:**ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు 2024 ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు 100% ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేసి ఆదివాసీలకు న్యాయం చేస్తానని ఎన్నికల హామీని అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సిసం సురేష్ డిమాండ్ చేశారు .గురువారం నాడు గొడ్లగూడెం గ్రామంలో జరిగిన ఆదివాసి గిరిజన సంఘం జనరల్ బాడీ సమావేశంలో జిల్లా నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ ఆదివాసీలకు 100% ఉద్యోగ రిజర్వేషన్ సాధనకై ఆదివాసి గుడేల నుండి ప్రతి ఇంటి నుంచి కదిలి 100% ఉద్యోగ రిజర్వేషన్లు భాగస్వామ్యం కావాలని అన్నారు ఈనాడు దేశంలోనూ మరియు రాష్ట్రంలోని పాలక అధినేతలు ఎన్నికల సందర్భంలో మాత్రమే ఆదివాసులు పేదలు హక్కులు రిజర్వేషన్లు గుర్తుకు వస్తాయని ఆ సందర్భంలో మాత్రమే హక్కుల రక్షణగా ఉంటామని ఆదివాసీల అభివృద్ధికి చట్టాలు చేస్తామని మాట్లాడతారని 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా అరకు సభలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100% ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు అయినా ఆచరణ శూన్యంగా కనిపిస్తుందని అంతేకాకుండా 2025 డిఎస్సి లో ఆదివాసి నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఈ సందర్భంగా అన్నారు ఆదివాసీలు భూ హక్కుల పరిరక్షణ చట్టం 1/70 చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ ప్రాంతంలోని పోలవరం నిర్వాసితులకు పునరావాసం పరిహారం సంపూర్ణంగా అందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు అంతేకాకుండా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు సాగు చేస్తున్న సాగు భూములకు హక్కు పత్రాలు అందించాలని



హక్కు పత్రాలు లేక ఆదివాసి ప్రజానీకం అనేక వేధింపులకు గురవుతున్నారని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని పోటు భూమి సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం సీనియర్ నాయకులు మడకం చిన్నయ్య, మహిళా సంఘం నాయకులు మొరం రంగమ్మ, ఆదివాసి గిరిజన సంఘం గ్రామ నాయకులు కట్టం సింగయ్య, కట్టం గంగరాజు, రవ్వ కాంతారావు, కన్నారావు, ముత్తయ్య, మీడియం జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల మేలు

**-నీటి కుంటల నిర్మాణంపై అవగాహన**

**టి మీడియా , జులై16, ఖమ్మం రూరల్:**ఖమ్మం రూరల్ మండలంలో గుర్రాలపాడు, గోళ్ళపాడు, ముత్తగూడెం, వాల్యా తండా గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటలు మరియు వ్యవసాయ నీటి కుంటల నిర్మాణం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు గోళ్ళపాడు లో జరిగిన అవగాహన కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మిట్టపల్లి సతీష్ గారు హాజరై రైతులకు ప్రత్యామ్నాయ పంటలు మరియు వ్యవసాయ నీటి కుంటల నిర్మాణం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సతీష్ గారు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు అధిక నీటి అవసరం ఉన్న వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలైన పెసర, కంది, జొన్న, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు నష్టాలను



నివారించవచ్చని వివరించారు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట ఎంపిక చేసుకోవడం వల్ల దిగుబడులు మెరుగవటంతో పాటు రైతుల ఆదాయం కూడా స్థిరంగా ఉంటుందని తెలిపారు అదే విధంగా వి బి జి రాంజీ పథకం ద్వారా రైతులకు 100% రాయితీతో వ్యవసాయ నీటి కుంటలు (ఫామ్ పాండ్లు) నిర్మించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు ఈ నీటి కుంటలు 20ఐ20ఐ3 మీటర్లు 12ఐ12ఐ2.5 మీటర్లు మరియు 8ఐ8ఐ2.5 మీటర్లు పరిమాణాల్లో నిర్మించబడతాయని వివరించారు వర్షాకాలంలో కురిసే వర్షపు నీటిని నిల్వ చేసి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవడానికి ఈ నీటి కుంటలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు అలాగే భూగర్భ జలాల మట్టం పెరగడం పంటలకు రక్షణ ఆత్మక నీటిపారుదల అందించడం కరువు పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం పెరగడం చేపల పెంపకం వంటి అనుబంధ కార్యక్రమాలకు కూడా ఈ కుంటలు దోహదపడతాయని రైతులకు వివరించారు అర్హత కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ భూముల్లో నీటి గుంటలను నిర్మించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.ఉమా నగేష్ గారు ఏదులాపురం మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ బుర్ర మహేష్ గారు మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భద్రకాళి గారు మల్లారెడ్డి గారు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆదర్శ్, కావ్య, వంశీ, నజ్మా కౌసర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

# పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

**- డీఈవో జి. సదానందం**

**- కారేపల్లి కేజీబీవీని సందర్శించి**

**విద్యార్థినులకు దిశానిర్దేశం**



**టీ మీడియా,జులై16,సింగరేణి(కారేపల్లి):** విద్యార్థులు పట్టుదలతో చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టి లక్ష్యసాధన దిశగా కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి జి. సదానందం అన్నారు.గురువారం కారేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సూర్యగ్రహణం,చంద్రగ్రహణం వంటి ప్రకృతి దృగ్విషయాలు ఎలా ఏర్పడతాయనే అంశాలపై విద్యార్థినులతో ప్రశ్నోత్తరాల రూపంలో చర్చించి,నిత్యజీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థి జీవితం అత్యంత విలువైనదని,అనవసర విషయాలకు సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని,పాఠశాల దశలోనే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని ఆయన సూచించారు.అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజన నాణ్యతపై సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.అలాగే మండల పరిధిలో కుట్టిస్తున్న ఏకరూప దుస్తులను పరిశీలించి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని ఆదేశించారు.విద్యార్థినులకు వారం రోజుల్లోగా యూనిఫాంలను పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీఎంవో బాజోజు ప్రవీణ్ కుమార్,ఉపాధ్యాయులు సమీనా,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన

సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయా యని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయా యని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లలులేని సేవకు అరుదైన పురస్కారం

బడుగు, బలహీన వర్గాలతో పాటు వివిధ సేవా రంగాల ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించారు. లక్షల ఖర్చును వెచ్చించి ఉదారత చాటారు. అలాగే వైద్య రంగంలోని మెడికల్, పారా మెడికల్ విధ్యనభ్యసించిన సుమారు మూడు వేల మంది విద్యార్థులను వారియర్స్ గా తయారు చేసి కరోనా పాజిటివ్ బాధితులకు ప్రత్యక్ష సేవలు అందించడంలో డాక్టర్ పులిపాటి చొరవ చూపారు. ఆ కష్ట సమయంలో ఎంతో సాహసంతో, నిస్వార్థ చింతనతో డాక్టర్ పులిపాటి ప్రసాద్ అందించిన సేవలకు తాజాగా శిల్ప కళా ఆర్ట్స్ ఇంటర్నేషనల్ అకాడమీ వారు "ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్" అవార్డును ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ పురస్కారానికి ఎంపికైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తొమ్మిది మంది ప్రముఖుల్లో డాక్టర్ పులిపాటి ఒకరు కావడం విశేషం.

**బాబుతో దశాబ్దాల సాన్నిహిత్యం**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఖమ్మంలోని పులిపాటి విద్యా సంస్థల అధినేత డాక్టర్ పులిపాటి ప్రసాద్ కు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. విద్యార్థి దశలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావుతో అనుబంధం ఏర్పడింది. గండిపేటలో కార్యాలయ కార్యదర్శిగా ఎన్టీఆర్ తో దగ్గరి సాన్నిహిత్యాన్ని పొందగలిగారు. అనంతరం తన పదహారవ ఏట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పని చేస్తూ చంద్రబాబు తలలో నాలుకలా మెలిగారు. అలాంటి చంద్రబాబు చేతుల మీదుగా పులిపాటి ఈ ప్రత్యేక అవార్డును అందుకోవడం విశేషం. విద్యా సంస్థల అధినేతగా, రాజకీయ నేతగా మరింత ఎత్తుకు ఎదగాలని ఈ సందర్భంగా పులిపాటిని సీఎం చంద్రబాబు నాయుడు ఆశీర్వదించడం శుభ పరిణామం. అలాగే దేశ రాజకీయాల్లో కీలక నేత, లెజెండరీ లీడర్, డైనమిక్ ఫిగర్ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా "ఎక్సెలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు"ను అందుకోవడం తన పూర్వ జన్మ సుకృతమని పులిపాటి వ్యాఖ్యానించారు.

# మద్యం సిండికేట్ రాజ్యం..!

**సింగరేణిలో ఎమ్మార్పీపై రూ.20 నుంచి రూ.50 అదనపు వసూళ్లు..?**





**చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ..**

**సిండికేట్‌కు కొమ్ముకాస్తున్న అధికారులా..?**

**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో మద్యం వ్యాపారం పూర్తిగా సిండికేట్ చేతుల్లోకి వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామాలు,తండాలు అనే తేడా లేకుండా బెల్ట్ షాపులకు ఎమ్మార్పీ ధర కంటే ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో వినియోగదారులపై భారీ భారం పడుతున్నా, ఎక్సైజ్ శాఖ మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

**టీ మీడియా,జులై16,సింగరేణి(కారేపల్లి):** మండలంలో అక్రమ బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నా,వాటిపై దాడులు,తనిఖీలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. "మద్యం సిండికేట్‌కు ఎక్సైజ్ అధికారుల అండదండలున్నాయా?", "మామూళ్ల మత్తులో అధికారులు విధులు మరిచారా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు మద్యం విక్రయించడం వల్ల సాధారణ ప్రజలు నష్టపోతుండగా,గిరిజన ప్రాంతాల్లో యువత మద్యం వ్యసనానికి బానిసలవుతున్నారని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాయంత్రం వేళల్లో బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించడం,గొడవలు,అసాంఘిక కార్యకలాపాలు పెరిగి మహిళలు,విద్యార్థులు,వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు.మండలంలో మద్యం విక్రయాలను కొందరు వ్యాపారులు సిండికేట్‌గా నిర్వహిస్తూ,ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి,ఆరోపణలు నిజమైతే అక్రమ వ్యాపారులపై,నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# కారేపల్లిలో గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

**ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు**

**అక్రమ విక్రయదారులకు హెచ్చరిక**

**టీ మీడియా,జులై16,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు, కారేపల్లి ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో గురువారం గంజాయి అక్రమ విక్రయాలపై విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.విద్యార్థులు,యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని చాక్లెట్లు,సిగరెట్లు,పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారనే సమాచారంతో కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్ డబ్బాలు,కిరాణా దుకాణాలు,అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.గంజాయి హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు,పాన్ షాపులు,కిరాణా దుకాణాల ముసుగులో మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీ ్ ు క ్ ం ం టా వ ు ని హెచ్చరించారు.ఎలాంటి అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఎస్సై బైరు గోపి మాట్లాడుతూ,మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని,తల్లిదండ్రులు తమ పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే కారేపల్లి పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.



## రైల్వే డబ్లింగ్ భూ నిర్వాసితుల సమస్యపై క్షేత్రస్థాయిలో సంయుక్త పరిశీలన

కుమార్,భూ నిర్వాసితులు,ఒడ్డుగూడెం,చర్లపల్లి,గాదెపాడు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్వే నంబర్--67 భూమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.దీంతో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా భూమి హద్దులను పరిశీలించి, సంబంధిత రికార్డులను పరిశీలించారు.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ,రెవెన్యూ,అటవీ శాఖల నివేదికలు,రికార్డుల ఆధారంగా సమస్యను త్వరితగతిన పరిష్కరించే చర్యలు తీసుకుంటామని భూ నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు.అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ,రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం రైల్వే శాఖకు భూమిని ఏ విధంగా బదిలీ చేయాలి,పరిహారం అంశాన్ని ఎలా అమలు చేయాలనే విషయాన్ని స్పష్టం చేస్తామని తెలిపారు.పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎఫ్ఆర్ఓ వెల్లడించారు.ఈ సందర్భంగా గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ,భూ నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ సమస్యను వైరా ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి,రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## చైన్ స్నాచర్ కు మూడేండ్ల 6 నెలల జైలు శిక్ష

**టీ మీడియా,జూలై16, ఖమ్మం**

నగరంలోని జూబ్లీపుర ప్రాంతంలో నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న పెనుగొండ లక్ష్మీకాంతం అనే ఓ మహిళ మెడలో ఉన్న బంగారం చైన్ తెంపుకుని పారిపోయిన ఎడరబోయిన సుమన్ కు మూడేళ్ళ ఆరు నెలల జైలు శిక్ష, 30 వేల జరిమానా విదిస్తూ.. ఖమ్మం 3వ అదనపు జేఎఫ్సీఎం కోర్టు న్యాయమూర్తి అరవ ప్రవీణ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2026 మే 4న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలోని వ్యాపారం పనులు ముగించుకొని గాంధీచౌక్ నుండి జూబ్లీపురాలోని ఇంటికి ఒంటరిగా వెళ్తున్న పెనుగొండ లక్ష్మీకాంతం మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం చైన్ ను గుర్తు తెలియని నిందితుడు తెంపుకుని పారిపోయియాడని

బాధితరాలు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయంస్థానంలో సమర్పించగా.. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఖమ్మం పాండురంగపురంకు చెందిన ఎడరబోయిన సుమన్కు 3 సంవత్సరాల 6 నెలల జైలు శిక్ష, రూ. 30,000 జరిమానా కూడా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో, 6 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కు సహకరించిన రెండు నెలలలో నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారి ఇన్‌స్పెక్టర్ జె. మోహన్ బాబు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.గాయత్రి, కోర్టు కానిస్టేబుల్ వి.రామకృష్ణ, కోర్టు అనుసంధాన అధికారులు ఎస్సై కె. శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ డి. నాగేశ్వరరావు ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.